గంజాయి మత్తులో నేరాల బాట..!

- సింగరేణిలో జోరుగా కొనసాగుతున్న దందా
- మరో పక్క విచ్చలవిడిగా మద్యం బెల్ట్ షాపులు
- చోద్యం చూస్తున్న పోలీసులు, ఎక్సైజ్ అధికారులు

సైదాబాద్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): సైదాబాద్ సింగరేణి కాలనీలో గంజాయి దందా జోరుగా సాగుతోంది. యువత మత్తుకు బానిసై నేరాల బాటపడుతున్నారు. మత్తులో ఏం చేస్తున్నారో కూడా తెలియని పరిస్థితిలో వారున్నారు. ఇటీవల గంజాయి మత్తులో ఎనిమిదేళ్ల చిన్నారిపై అత్యాచారం, వరుస దారిదోపిడీలు, దాడులు, చోరీలు కోకొల్లలుగా దర్శనమిస్తున్నాయి. కొందరు యువకులు, బాలలు గంజాయి లేనిదే ఉండలేని పరిస్థితికి చేరుతున్నారని, ఆ మత్తులోనే అసాంఘిక చర్యలు, గొడవలు, దాడులు చేస్తూ బీభత్సం సృష్టిస్తున్నారు. సింగరేణి పరిసరాలలో గంజాయి అమ్మకాలు విచ్చలవిడిగా సాగుతున్నాయని, దీంతో ముఖ్యంగా యువత జీవితాలను నాశనం చేస్తోందని తల్లిదండ్రులు వాపోతున్నారు. ఇతర ప్రాంతాల నుంచి బైక్, ఆటోల ద్వారా యథేచ్ఛగా తరలిస్తున్నారు. ప్యాకెట్లను బట్టి రూ.50 నుంచి రూ.200 వరకు తీసుకుంటున్నారు. వీటిని తీసుకున్న యువకులు సిగరెట్లతో గంజాయి పెట్టి పీలుస్తున్నారు. యువతతో పాటు కూలీలు, కొంతమంది మహిళలు సైతం గంజాయి మత్తుకు అలవాటు పడ్డారని స్థానికులు ఆరోపిస్తున్నారు.



గంజాయి అమ్మకాలు అరికట్టాలని సైదాబాద్ ఇన్‌స్పెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నేతలు

ఎనీ టైం మద్యం (ఏటీఎం) అమ్మకాలు

మద్యం దుకాణాలు రాత్రి 8 గంటలకు మూసివేస్తుండటంతో బెల్ట్‌షాప్ వ్యాపారుల పంట పండుతున్నది. ముఖ్యంగా సింగరేణి కాలనీ రోడ్లపై మందుబాబులతో జాతర సాగుతున్నది. ఇదే అదనుగా ఒక్కో బీరుకు రూ.100, క్వార్టర్‌కు రూ.50, ఫుల్ బాటిల్‌కు రూ.200-300 అదనంగా వసూలు చేస్తున్నారు. అయితే ఇదంతా కొందరు వైన్స్ దుకాణాల యాజమానుల అండతోనే ముందస్తుగా మద్యం నిల్వ చేసుకుంటున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. సింగరేణి కాలనీ, ఖాజాబాగ్ బస్తీలలో ఎనీ టైం మద్యం (ఏటీఎం) అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. ముఖ్యంగా రాత్రి వేళలలో సింగరేణి కాలనీ రోడ్డుపై వాహనాదారులు వెళితే మహిళలు, చిన్నారులు అడ్డంగా తిరుగుతారు. ఇక్కడ మద్యం బాటిల్స్ దొరకుతాయి..తీసుకోవాలని కోరడం పలువురిని ఆశ్చర్యానికి గురిచేస్తుంది. ఇంత జరుగుతున్నా పోలీసులు, మలక్‌పేట ఎక్సైజ్ పోలీసులు ఇటు దిక్కుగా రాకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.



సింగరేణి రోడ్లపై రాత్రివేళలలో రోడ్లపై బహిరంగంగా మద్యం అమ్మకాలు (ఫైల్)

అమ్మకాలపై కఠిన చర్యలు



ఎవరైనా గంజాయి విక్రయిస్తూ యువతను పెడదారి పట్టిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. గంజాయి అమ్మకాలు, దీని వాడకం కారణంగా వచ్చే దుష్పరిణామాలపై ఎప్పటికప్పుడు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. అమ్మకాలు జరుగుతున్నట్లు ఎవరికైనా తెలిస్తే వెంటనే మాకు సమాచారం ఇవ్వండి.

- చంద్రమోహన్, సైదాబాద్ ఇన్‌స్పెక్టర్

మత్తుతోనే సింగరేణి కాలనీలో నేరాలు



సింగరేణి కాలనీలో గంజాయి, అక్రమ మద్యం అమ్మకాలను అరికట్టాలి. గంజాయి, మద్యం అమ్మకాలతోనే సింగరేణి కాలనీలో నేరాలు జరుగుతున్నాయి. పోలీసులు, ఎక్సైజ్ శాఖ చర్యలు తీసుకోవాలి. ప్రత్యేక పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేసి అమ్మకాలపై పటిష్ట చర్యలు తీసుకోవాలి.

- మోతీలాల్ నాయక్, అధ్యక్షుడు, సేవాలాల్ బంజారా సంఘం

ఫిర్యాదు చేసినా చర్యలు లేవు



గంజాయి, అక్రమ మద్యం అమ్మకాలపై ఎక్సైజ్ కమిషనర్, పోలీసులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినా చర్యలు చేపట్టడం లేదు. మరో పక్క మద్యం బెల్ట్ షాపుల దందాతో ప్రజలు ఇబ్బందులు వస్తున్నాయి. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

- షేక్ మహమూద్, కార్యదర్శి, సీపీఐ, ఐఎస్‌సదన్



రేషన్ బియ్యం, గోధుమలు స్వాధీనం చేసుకున్న ఇన్‌స్పెక్టర్ చంద్రమోహన్

అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యం పట్టివేత

సైదాబాద్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యం, గోధుమల గోదాంపై పౌరసరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, పోలీసులు దాడి చేసి స్వాధీనం చేసుకున్నారు. చంపాపేట రెడ్డికాలనీలో పేదలకు పంపిణీ చేయాల్సిన పీడీఎస్ బియ్యం, గోదాం పక్కదారి పట్టి అక్రమ నిల్వ ఉంచుతున్నారనే సమాచారం మేరకు పౌరసరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, సైదాబాద్ పోలీసులు దాడి చేశారు. గోదాంలో దాచి ఉంచిన 55 క్వింటాళ్ల బియ్యం, 37 క్వింటాళ్ల గోధుమలను సీజ్‌చేశారు. వీటి విలువ రూ.3.10 లక్షల వరకు ఉంటుందని అధికారులు తెలిపారు. స్థల యాజమాని బేబీ, గోదాం నిర్వహిస్తున్న హరీష్ రెడ్డిలపై సైదాబాద్ పోలీసులు కేసులు నమోదు చేశారు.



శక్తినగర్‌లో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న కార్పొరేటర్ వెంకటేశ్వర్ రెడ్డి

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం: రాగుల

వనస్థలిపురం, నవంబరు9 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే తన ధ్యేయమని వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. వనస్థలిపురం డివిజన్ శక్తినగర్‌లో నిర్మించిన సీసీ రోడ్డును ఆదివారం కార్పొరేటర్ వెంకటేశ్వర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాలనీ వాసులు ఎదుర్కొంటున్న సమస్యలను పూర్తిగా పరిష్కరిస్తానన్నారు. అభివృద్ధిలో భాగంగా వనస్థలిపురం డివిజన్‌ను ముందంజలో ఉంచుతానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు అబ్బనగొని అజయ్ యాదవ్, ప్రధాన కార్యదర్శి ఎండీ ఖాదర్, కొత్త కృష్ణయ్య ముదిరాజ్, వంగాల రాంరెడ్డి, యాదవరెడ్డి, మహాలింగం నేత, నాయిని రాంరెడ్డి, రవీందర్ రెడ్డి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



సమస్యలను కార్పొరేటర్‌కు వివరిస్తున్న ఆటోసాయినగర్ సంక్షేమ సంఘం

కాలనీ సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తా: కళ్లెం

వనస్థలిపురం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కాలనీల్లో నెలకొన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తానని హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి అన్నారు. హయత్‌నగర్ డివిజన్ ఆటోసాయినగర్ కాలనీ సంక్షేమ సంఘం నూతన కమిటీ ఎన్నికైన సందర్భంగా కమిటీ సభ్యులు ఆదివారం మర్యాదపూర్వకంగా కార్పొరేటర్‌ని కలిసి కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తానన్నారు. డివిజన్‌లో నెలకొన్న సమస్యలను శాశ్వతంగా పరిష్కరించి డివిజన్‌ను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తానని ఆయన హామీ ఇచ్చారు.



వేడుకను ప్రారంభిస్తున్న తీగుళ్ల యాదగిరి ప్రజాపతి, ఎలిమినేటి నారాయణ ప్రజాపతి, సభ్యులు

ఘనంగా కుమ్మర శాలివాహనుల వనమహోత్సవం

మన్సూరాబాద్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మన్సూరాబాద్ డివిజన్ వనస్థలిపురం సుష్మా చౌరస్తా సమీపంలోని ఎంఈ రెడ్డి గార్డెన్స్‌లో ఆదివారం కుమ్మర శాలివాహనుల కార్తీక వనభోజన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. కుమ్మర శాలివాహన సంఘం హైదరాబాద్ తూర్పు విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలను తూర్పువిభాగం అధ్యక్షుడు తీగుళ్ల యాదగిరి ప్రజాపతి, ప్రధాన కార్యదర్శి ఎలిమినేటి నారాయణ ప్రజాపతిలు సభ్యులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం కుమ్మరుల వివాహ పరిచయ వేదిక, ప్రముఖులకు సన్మానం, ఇతర వినోదాత్మక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ప్రజాపతి మాట్లాడుతూ కుల బాంధవుల్లో ఐక్యతను పెంపొందించడంలో భాగంగా నాలుగేళ్ల పాటు కుమ్మర శాలివాహన వన మహోత్సవాలు నిర్వహిస్తూ వస్తున్నామన్నారు. అన్ని రంగాల్లో కుమ్మరులు ఐక్యంగా రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాంపల్లి రామేశ్వర్, టి.ఉపేందర్, చంద్రశేఖర్, శ్రీనివాస్, నాంపల్లి శంకరయ్య, జానయ్య, మల్లేష్, వెంకటేష్, పి.రాము, బొడ్డుపల్లి రవి, ఎం.శ్రీధర్, ఎం.సుధాకర్, బుచ్చిబాబు, చంద్రకాంత్, ఉపేందర్, శ్రీనివాసరావు, పెద్ద ఎత్తున కులబాంధవులు, మహిళలు పాల్గొన్నారు.

కార్తీక మాస పూజల్లో ఏకాదశ రుద్రహోమం



వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఏకాదశ రుద్రహోమం

కొత్తపేట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్నేహపురి కాలనీలోని పద్మావతీ గోదా సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో కార్తీక మాస మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం ఆరుద్ర నక్షత్రం, సంకష్ట హర చతుర్థి వేళ ఆలయంలో గణపతి హోమం, అనంతరం 11 సార్లు నమక చమకాలతో రుద్ర పారాయణంచేస్తూ ఏకాదశ రుద్ర హోమం నిర్వహించారు. పరిసర కాలనీల భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి విశేష పూజల్లో పాల్గొన్నారు.



వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ వారు ఏర్పాటు చేసిన 'కలం యోధులకు అభినందన మందారమాల' కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ఆర్టీఐ కమిషనర్ బోరెడ్డి అయోధ్య రెడ్డి చేతులమీదుగా మీడియా రత్న అవార్డును అందుకుంటున్న బీఎన్‌రెడ్డినగర్‌కు చెందిన ప్రముఖ వాస్తు నిపుణులు, సామాజికవేత్త పి.కృష్ణాదిశేష

- వనస్థలిపురం, ఆంధ్రజ్యోతి

తెలుగు ప్రజలు ఎక్కడున్నా కలిసే ఉందాం

టీపీసీసీ ప్రచారకమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్



మధుయాష్కీగౌడ్‌ను సన్మానిస్తున్న కౌండిన్య వెల్ఫేర్ అధ్యక్షుడు సురేష్‌గౌడ్, సభ్యులు

మన్సూరాబాద్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రాంతాలుగా ఏపీ, తెలంగాణ విడిపోయినప్పటికీ తెలుగు ప్రజలు ఎక్కడున్నా అన్నదమ్ముల్లా కలిసేఉండాలని, సెటిలర్స్ అనే పదం ఎవరూ వాడరాదని టీపీసీసీ ప్రచారకమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కీగౌడ్ అన్నారు. కౌండిన్య ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆటోనగర్‌లోని హరిణవనస్థలి నేషనల్ పార్కులో వనమహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన మధుయాష్కీ మాట్లాడుతూ, కౌండిన్యులు సమావేశాలు నిర్వహించుకునేందుకు స్థలం కేటాయించి భవనం నిర్మించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబులను కలిసి కోరతానన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అనంతరాజుగౌడ్ సభ్యులు ధనరాజ్‌గౌడ్, అఖిలభారత గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కూరెళ్ల వేములయ్యగౌడ్, కౌండిన్య ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కాసాని సురేష్‌గౌడ్, సభ్యులు రాఖీగౌడ్, యార్లగడ్డ వెంకటేశ్వరరావు, కొత్త మహేష్‌గౌడ్, నరేందర్‌గౌడ్, రమణాగౌడ్, బుర్ర రవీందర్‌గౌడ్, న్యాయవాది బిక్షపతిగౌడ్ పాల్గొన్నారు.

హాస్టళ్లు, గురుకులాలకు భవనాలు నిర్మించాలి

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య



విద్యార్థులతో ఇందిరాపార్కు వద్ద భారీ ప్రదర్శన నిర్వహిస్తున్న ఎంపీ ఆర్ కృష్ణయ్య

కవాడిగూడ, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూములను అమ్మవద్దని, ఆ స్థలా ల్లో ప్రభుత్వ హాస్టళ్లు, గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఎంపీ ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఆదివారం బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నీల వెంకటేష్, బీసీ యువజన సంఘం అధ్యక్షుడు జిల్లపల్లి అంజి ఆధ్వర్యంలో ఇందిరా పార్కు వద్ద వందలాదిమంది విద్యార్థులతో మహాధర్నా, ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ ప్రభుత్వ భూములను అమ్మితే భావితరాలకు ఏమి మిగులుతుందని ప్రభుత్వ భూముల వేలాన్ని అడ్డుకుంటామని ఆయన హెచ్చరించారు. భవన నిర్మాణాలకు 80శాతం గ్రాంట్ కేంద్రప్రభుత్వం ఇస్తుందని మల్టీనేషనల్ కంపెనీల నుంచి సీఎస్ఆర్‌ఫండ్స్ తీసుకొని భవనాలను నిర్మించాలని దీనికి పార్లమెంటు సభ్యులం కృషి చేస్తామని ఆయన అన్నారు. అద్దె భవనాల్లో విద్యార్థులు చాలిచాలని వసతులతో ఇబ్బందులు పడుతున్నారని అన్ని వసతులతో సొంత భవనాలు నిర్మిస్తే హాస్టల్, గురుకుల విద్యార్థులకు ఎంతో ఉపయోగంగా ఉంటుందని ఆయన అన్నారు. హాస్టళ్లకు ఎనిమిది నెలల మెస్ బిల్లులు బకాయిలు వెంటనే చెల్లించాలని, అద్దెభవనాల బకాయిలు కూడా మూడేళ్లుగా చెల్లించడం లేదని వీటిని వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఇంజనీరింగ్, ఎంబీఏ, ఎంసీఏ, ఫార్మసీ, పీజీ, డిగ్రీ, ఇంటర్ కోర్సులు చదివే బీసీ విద్యార్థుల మొత్తం ఫీజులను ప్రభుత్వమే భరించాలని ఈ కోర్సులకు ఉన్న ఫీజుల గరిష్ట పరిమితిని ఎత్తివేసి గతంలో మాదిరిగా పూర్తిఫీజులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

పరీక్షలతోనే క్యాన్సర్ నిర్ధారణ, నివారణ సాధ్యం



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ కృష్ణప్రసాద్

మౌలాలి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ పరీక్షలు నిర్వహించిన తరువాతనే క్యాన్సర్ నిర్ధారణ చేస్తే నివారణ సాధ్యమని డాక్టర్ కృష్ణ ప్రసాద్ అన్నారు. ఆదివారం గౌతమ్‌నగర్ డివిజన్‌లోని సాయినగర్‌లోని సాయి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బసవతారకం ఇండో అమెరికన్ ఆస్పత్రి సౌజన్యంతో క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. సుమారు 300 మంది రిజిష్టర్ చేసుకోగా వంద మందికి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు మల్లేష్, లింగారెడ్డి, హనుమంతరావు, డాక్టర్ నీల్, త్రివేది తదితరులు పాల్గొన్నారు.

చివరిరోజు.. ప్రచారాల జోరు



రహమత్‌నగర్ డివిజన్‌లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్‌ను గెలిపించాలని కోరుతూ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న టీపీసీ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్



జవహర్‌నగర్ కాలనీలో బీజేపీ జెండాలతో ప్రచారం చేస్తున్న కొత్తపేట కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్

చంపాపేట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 11న జరగనున్న జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ ఘన విజయం సాధించనున్నారని టీపీసీ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్ అన్నారు. రహమత్‌నగర్ డివిజన్‌లోని శ్రీరామనగర్, సంజయ్‌నగర్, ఎస్‌పీఆర్ హిల్స్, కార్తీకనగర్, ఆర్‌కేనగర్‌లలో ఆదివారం సేవాదళ్ నాయకులతో కలిసి ఆయన ఇంటింటా తిరిగి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నియోజకవర్గ అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సారధ్యంలో ప్రజా ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు చేపట్టిందని తెలిపారు. మహిళలకు బస్సులలో ఉచిత ప్రయాణం, రైతులకు రైతు భరోసా, రుణమాఫీ, గృహ వినియోగదారులకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, 500కే గ్యాస్ సిలిండర్, అర్హులకు తెల్లరంగు రేషన్‌కార్డులతో పాటు పలు పథకాలను అందించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కిందన్నారు. కార్యక్రమంలో సేవాదళ్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేట, మన్సూరాబాద్, ఆంధ్రజ్యోతి: జూబ్లీహిల్ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా చివరిరోజైన ఆదివారం బీజేపీ అభ్యర్థి లంకల దీపక్‌రెడ్డిని గెలిపించాలని కొత్తపేట కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ కోరారు. జవహర్‌నగర్ కాలనీలో బీజేపీ జెండా పట్టి ఆయన ప్రచారం చేశారు. మన్సూరాబాద్‌లోని వెంగళరావునగర్ డివిజన్‌లో రోడ్డుషోలో గల్లీగల్లీ తిరుగుతూ బీజేపీ అభ్యర్థికోసం ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల సురేంద్రనాథ్‌యాదవ్ ప్రచారం చేశారు.



వెంగళరావునగర్‌లో సురేంద్రనాథ్

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సైదాబాద్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): టీఎస్ఎస్‌పీడీసీఎల్ ఆస్మాన్‌ఘడ్ డివిజన్ పరిధిలోని మరమ్మతుల కారణంగా సోమవారం 11కేవీ శాలివాహన నగర్ ఫీడర్ పరిధిలోని పరిసర ప్రాంతాలలో ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు, ఎస్‌బీఐ కాలనీ ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డీఈ విష్ణువర్ధన్ రెడ్డి తెలిపారు.



ఉచిత బ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న తెలంగాణ బ్రాహ్మణ సేవా సమాఖ్య గ్రేటర్ హైదరాబాద్ సభ్యులు

26న బ్రాహ్మణుల వివాహ పరిచయ వేదిక

ఎల్బీనగర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ బ్రాహ్మణ సేవా సమాఖ్య గ్రేటర్ హైదరాబాద్ ఆధ్వర్యంలో జనవరి 26న ఉచిత బ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక ఏర్పాటు చేస్తున్నట్లు బ్రాహ్మణ సమాఖ్య గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు మునిపల్లి శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం ఎల్బీనగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో చైర్మన్ వెన్నంపల్లి జగన్మోహన్ శర్మ, అధ్యక్షుడు మోత్కూరు రామేశ్వరరావుతో కలిసి బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మునిపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ, నాగోల్ రాక్‌టౌన్‌కాలనీలోని గోటేటి కల్యాణ వేదికలో జనవరి 26న బుధవారం ఉచిత బ్రాహ్మణుల వివాహ పరిచయ వేదిక నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ఉచిత వివాహ పరిచయ వేదికను రాష్ట్రంలోని బ్రాహ్మణులంతా సద్వినియోగం చేసుకోవాలని, ఇతర వివరాలకు 7036002288 మొబైల్‌లో సంప్రదించాలన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ బ్రాహ్మణ సేవా సమాఖ్య భాస్కరమూర్తి, విజయలక్ష్మి, గొల్లపూడి శర్మ తదితరులు ఉన్నారు.



కార్తీక వనమహోత్సవంలో నృత్యం చేస్తున్న బాలిక

కమ్మ సేవా సంఘం.. కార్తీక వనమహోత్సవం

మన్సూరాబాద్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మన్సూరాబాద్ డివిజన్ కేబీఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో ఆదివారం వనస్థలిపురం కమ్మ సేవా సంఘం ఆధ్వర్యంలో 36వ కార్తీక వన మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు ముఖ్య అతిథులుగా కమ్మ కుల ప్రతినిధులు జట్టి కుసుమకుమార్, టి.జనార్థన్, నందిగామ శ్రీనివాస్, సోమవరపు కార్తీక్, బ్రహ్మం చౌదరి, నేలపాటి రామారావు ఇతరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కష్టపడి ఉన్నత స్థానంలో ఉన్న కమ్మ పెద్దలను ఆదర్శంగా తీసుకుని కమ్మ సోదరులు అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. ఇందులో భాగంగా యువతీయువకుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో వనస్థలిపురం కమ్మ సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.



పద్మశాలి వన మహోత్సవ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న కర్నాటి మనోహర్

16న పద్మశాలి వన మహోత్సవ ఆత్మీయ సదస్సు

మన్సూరాబాద్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పద్మశాలీల కార్తీక మాస వన మహోత్సవ ఆత్మీయ సదస్సును నాగోల్ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో 16వ తేదీ ఆదివారం నిర్వహించనున్నట్లు తెలంగాణ పద్మశాలి సంఘం వైస్ చైర్మన్, ఆలిండియా వ్యూవర్స్ ఫెడరేషన్ కోర్ మెంబర్ కర్నాటి మనోహర్ తెలిపారు. ఇందుకు సంబంధించిన బ్రోచర్‌ను సంఘం నాగోల్ అధ్యక్షుడు కొండబత్తుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కర్నాటి మనోహర్ మాట్లాడుతూ, నాగోల్ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో తట్టి అన్నారంలోని వనస్థలిహిల్స్‌లో నిర్వహించే ఈ వన మహోత్సవానికి నాగోల్ పద్మశాలీలు, కుల పెద్దలు, ప్రముఖులు విచ్చేసి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. బ్రోచర్ ఆవిష్కరణలో కర్నాటి చంద్రకాంత్, పద్మశాలి సంఘం నాగోల్ ఉపాధ్యక్షుడు పులిపాటి వెంకటరమణ, కార్యనిర్వాహక అధ్యక్షుడు వనమాల వెంకటేశ్వరప్రసాద్, ప్రధానకార్యదర్శి వడ్డేపల్లి శ్రీధర్, కోశాధికారి రచ్చ గోవర్ధన్ ఇతర సభ్యులు ఉన్నారు.